ప్రజాశక్తి
మంగళవారం 9 ఏప్రిల్ 2024
5
శ్రీ సత్యసాయి





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై సోమవారం నాడు వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, డ్వామా పీడీ విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం సుమారు రూ.5.54 కోట్లు నిధులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. తాగునీటి సరఫరా కోసం 179 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలియజేశారు. గ్రామాల్లో తాగునీటి చేతిపంపులకు, బోర్లు మరమ్మతులకు నిధులు కొరత లేదన్నారు.ఉపాధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలియజేశారు. కూలీలకు పని ప్రదేశాల్లో ప్రతి గంటకు మంచినీరు తాగే విధంగా వాటర్ బెల్టు విధానాన్ని పాటించేలా చర్యలు చేపట్టాలని ఉపాధి హామీ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామన్నారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు

శ్రీ క్రోధినామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ అరుణ్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగ ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలని ఆకాంక్షించారు. మంగళవారం నాడు కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో ఉదయం 7.30 గంటల నుంచి ఉగాది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా అధికారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.



కరువు నీడన ఉగాది

◆కనిపించని పండుగ సందడి ◆కొత్త ఏడాదిపైనే ఆశలన్నీ..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉగాది పండుగ అంటేనే పల్లె పండుగ. అనంతపురం జిల్లాలో అన్ని పండుగల కంటే ఉగాది పండుగను గొప్పగా జరుపుకోవడం ఆనవాయితీ. కొత్త బట్టలు, పిండి వంటలు చేసుకోవడంతో పల్లెల్లో ఎక్కడలేని సందడి నెలకొంటోంది. ఈ సందర్భంగా వసంతాలు రంగులు చల్లుకోవడం వంటివి గ్రామాలు జరుగుతుంటాయి. మరి కొన్ని గ్రామాల్లో గ్రామీణ పోటీలు జరుగుతుంటాయి. ఏడాది ప్రారంభానికి సూచికంగా ఎంతో ఉత్సహంగా జరుపుకునే ఈ పండుగ ప్రస్తుతం కళ తప్పింది. గతేడాది నుంచి నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తీవ్రమైన కరువు పరిస్థితులు ఈ ఏడాది నెలకొన్నాయి. దీంతో పంటలు సక్రమంగా వేయలేకపోయారు. వేసినా దిగుబడి వచ్చింది నామ మాత్రమే. ఆదాయం లేకపోవడంతో చేతిలో డబ్బుల్లేక ఉన్న కాడికి సర్దుకునే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పండుగకు కొత్త బట్టల్లేవు...పిండి వంటల్లేవన్నట్టుగా సాగుతోంది. కరువు నీడన ఉగాది పండుగ నిలిచింది.

కొత్త సంవత్సరంపై ఆశలు

ఉగాది పండుగతోనే తెలుగు నూతన సంవత్సరం ప్రారంభం అవుతుంది. ఈ పండుగ రోజున అంతా పంచాంగాలు చూసుకుని తమ రాశీ ఫలాలు ఈ రకంగా బాగున్నాయనికుని కొత్త ఆశలతో ఉత్సాహపడుతూ కనిపిస్తారు. ఈ పండుగతోనే వాతావరణంలో మార్పుల ప్రభావం ఉంటుంది. ఈ సమయంలో పడే తొలకరివానలతో వచ్చే ఖరీఫ్‌కు సమయత్తమయ్యేందుకు రైతన్న సిద్ధమవుతాడు. ఈ ఏడాది అయినా మంచి వర్షాలు పడి పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఎద్దులతో వెళ్లి పొలాల్లో వ్యవసాయ పనులను మొక్కుబడినైనా ప్రారంభించి రావడం ఆనవాయితీ. ఈ ఏడాది ఎన్నికలు కూడా రావడంతో వచ్చే ఏడాదిలోపు ఏర్పడే కొత్త ప్రభుత్వమైనా రైతుల వైపు కాస్త దయదలచి చూస్తుందన్న నమ్మకంతో ఎదురు చూస్తున్నారు. పంట పెట్టుబడులకు రాయితీలు, నష్టపోతే ఆదుకునే ప్రభుత్వాలు రావాలని కోరుకునే రోజు ఇది. నాయకులు గ్రామాల్లో పండుగ సందడికి సిద్ధమయ్యారు. పండుగ సమయంలో గ్రామాలకెళ్లి ప్రత్యేక పూజలు చేసి తాము కోరుకున్న ప్రభుత్వం రావాలని వేడుకునే పనిలో అభ్యర్థులు ఉన్నారు. ఆ మరుసటి రోజు ముక్కుకు మాత్రం కావాల్సినంత సాయం అందించేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు సిద్ధమయినట్లు కన్పిస్తోంది.


వర్షం లేక పంట ఎండిపోవడంతో గొర్రెలకు మేతగా వదిలేసిన వేరుశనగ పంట (ఫైల్ ఫొటో)

కొత్త బట్టల్లేవు..పిండ వంటలూ అంతంత మాత్రమే

చేతిలో చల్లిగవ్వ లేకపోవడంతో కొత్త బట్టలు కొనడం కంటే ఉన్న వాటితో సర్దుకునే పనిలో జనం ఉన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో పిండి వంటలు చేసుకోవడం కూడా భారమయ్యే పరిస్థితులుంన్నాయి. దీంతో చేసుకోవడం కంటే ఇంటికి అవసరమైన మేరకు బయట దుకాణాల్లో తెచ్చుకుని సర్దుకుంటే సరిపోతుందన్న ఆలోచనలోనున్నారు. దీంతో ప్రధాన పట్టణాలన్నింటిలోనూ ఓళిగ కేంద్రాల వద్ద షామియానాలు వంటివి వేసి ఏర్పాట్లు చేసి ఉన్నారు. కొంత మంది ముందుగానే ఆర్డర్లు ఇచ్చి ఉన్నారు.

ఏపీ ఈసెట్-2024కు 26,436 దరఖాస్తులు

◆ 15 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే అవకాశం

◆ ఏపీ ఈసెట్ ఛైర్మన్ జివిఆర్.శ్రీనివాసరావు

ప్రజశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఏపీ ఈసెట్-2024 పరీక్షకు 8వ తేదీ నాటికి 26,436 దరఖాస్తులు అందాయని ఏపీ ఈసెట్-2024 ఛైర్మన్ జివిఆర్.శ్రీనివాస రావు, కన్వీనర్ పిఆర్.భానుమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 22వ తేదీ వరకు, రూ.2000 అఫరాధ రుసుంతో ఈ నెల 29, రూ.5000 అపరాధ రుసుంతో మే నెల 2వ తేదీ వరకు ధరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఏపీ.ఈసెట్ 2024 పరీక్ష మే 8వ తేదీన ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2,30 గంటల నుంచి 5.30 గంటలకు వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైసిపికి మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి గుడ్‌బై

◆ ఆమె కుమారుడు కూడా.. ◆ మూడు రోజుల క్రితం కుమార్తె రాజీనామా

ప్రజాశక్తి-పుట్లూరు


శమంతకమణి

అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంకు చెందిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి వైసికి రాజీనామా చేశారు. ఆమె కుమారుడు అశోక్‌తో కలిసి వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. గత నాలుగు రోజుల క్రితం శమంతమని కూతురు, మాజీ ఎమ్మెల్యే యామినిబాల వైసికి రాజీనామా చేశారు. శమంతకమణి కాంగ్రెస్ పార్టీలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1989 నుంచి 1991 వరకు మంత్రిగా సేవలందించారు. ఆ తరువాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టిడిపిలో చేరారు. 2014లో శమంతకమణి కూతురు యామినీబాల శింగనమల టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2019లో వీరి కుటుంబానికి టిడిపి టికెట్ ఇవ్వలేదు. దీంతో వైసిపి అధికారం వచ్చిన తరువాత శమంతకమణి తన కూతురు, కుమారునితో కలిసి జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. 2024లో వైసిపి టికెట్ ఆశించినా వీరికి దక్కలేదు. దీంతో శమంతకమణి కుటుంబ సభ్యులు అందరూ వైసిపికి రాజీనామా చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డివైఇఒ రంగస్వామి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ గంగప్ప అధ్యక్షతన ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఇఒ మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహించరాదన్నారు. ఉదయం తరగతుల సమయంలో మధ్యాహ్నం పాఠశాలలు నిర్వహించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంఇఒలు గంగప్ప, ప్రసన్న లక్ష్మీ, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.


శ్రీరాములు భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్


శ్రీరాములు

గుండెపోటుతో పెనుకొండ జెడ్పీటీసీ మృతి

పలువురి నివాళి

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ మండల జెడ్పీటీసీ, వైసిపి సీనియర్ నాయకుడు గుట్టూరు శ్రీరాములు (55) గుండెపోటుతో ఆదివారం రాత్రి మరణించారు. శ్రీరాములు వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో క్రియాశీలక నాయకునిగా ఉన్నారు. మండల, నియోజకవర్గంలో గుర్తింపు పొందిన నాయకుడు. ఈయన మృతి విషయం తెలుసుకున్న పలు రాజకీయ పార్టీల నాయకులు గుట్టూరులో శ్రీరాములు భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. రాష్ట్ర మంత్రి, పెనుకొండ వైసిపి అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు మాలగుండ్ల శంకరనారాయణ, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, టిడిపి హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బికె.పార్థసారధి, పెనుకొండ టిడిపి అభ్యర్థి సవితమ్మ తదితరులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శ్రీరాములు మృతి వైసిపికి తీరని లోటని మంత్రి ఉషశ్రీచరణ్ తెలియాజేశారు. జెడ్పీటీసీగా, బీసీ సీనియర్ నాయకులుగా శ్రీరాములు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివన్నారు. అందరినీ ఆప్యాయతతో పలకరించే శ్రీరాములు మృతి తీవ్రంగా కలచి వేసిందన్నారు. వారి కుటుంబానికి వైసిపి అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర, శ్రీచరణ్ రెడ్డి, వైసిపి నాయకులు సుధాకర్ రెడ్డి, రామమోహన్‌రెడ్డి, మాలగుండ్ల రవీంద్ర, మాలగుండ్ల మల్లికార్జునతో పాటు జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రీరాములుకు నివాళులు అర్పించారు.

కలవని కూటమిపొత్తు..!

◆రాయదుర్గంలో ఎవరికి వారే ◆ఒకే కూటమిలో ఉన్నా కలవని కాపు, కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం


కాలవ శ్రీనివాసులు


కాప రామచంద్రారెడ్డి

రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ, లోకసభ సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు పార్టీలు కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్నాయి. రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థిగా కూటమి తరపున తెలుగుదేశం పార్టీ నుంచి కాలవ శ్రీనివాసులు ఎన్నికల బరిలో పోటీ చేస్తున్నారు. కాలవను అభ్యర్థిగా ప్రకటన చేయక ముందు నుంచి సుమారు రెండు నెలలుగా శ్రీనివాసులతోపాటు జనసేన రాయదుర్గం నియోజకవర్గం ఇన్‌ఛార్జి మంజునాథ్ గౌడ్‌తో కలిసి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. అయితే బిజెపి ఇంతవరకు ప్రత్యక్షంగా కూటమి అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. కాలవ శ్రీనివాసులుకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న రాయదుర్గం శాసనసభ్యులు కాపు రామచంద్రారెడ్డి వైసిపిని వీడి ఇటీవలే బిజెపిలో చేరారు. బిజెపి అగ్ర నాయకులను, ప్రధానమంత్రిని మాజీ ఉపరాష్ట్రపతిని, తెలంగాణ మాజీ గవర్నర్‌ను సైతం ఆయన కలిశారు. రాయదుర్గంలో మాత్రం ఇంత వరకు ఎన్డీఏ కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులును కలవలేదు. శ్రీనివాసులు కూడా బిజెపి నాయకుడు కాపు రామచంద్రారెడ్డిని కలవలేదు. కాపు బిజెపిలో చేరాక కొందరు స్థానిక బిజెపి నేతలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఆత్మీయ సమావేశం నిర్వహించి కాపును ఘనంగా సత్కరించారు. రెండు నెలల క్రితం వరకు కాపు రామచంద్రారెడ్డి, కాలవ శ్రీనివాసులు ఇద్దరూ బద్ద శత్రువులుగా ఉన్నారు. నిత్యం మీడియా ద్వారా ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకునేవారు. వ్యక్తిగత దూషణలకు సైతం పాల్పడేవారు. కాపు బిజెపిలో చేరిన తరువాత ఆయన మాట తీరులో కొంత మార్పు వచ్చింది. కాలవ తనకు రాజకీయ ప్రత్యర్థి కానీ, శత్రువు కాదని మీడియా ముఖంగా ప్రకటించారు. త్వరలో తాను ఉన్నత స్థానంలో ఉంటానని తాను నలుగురికి సాయం చేసేలా ఎదుగుతానని తెలియజేశారు. కాపు వైసిపిని వీడాక రాయదుర్గం, కళ్యాణదుర్గంలోనూ తాను, తన కుటుంబ సభ్యులు లేదా సన్నిహితులు ఎన్నికల బరిలో ఉంటారని ప్రకటించారు. వ్యక్తిగతంగా కానీ లేదా ఏదైనా పార్టీ తరపున కానీ పోటీ చేస్తామన్నారు. ఈ రెండు దుర్గాలు తమకు రెండు కళ్లు లాంటివన్నారు. కాంగ్రెస్ నాయకులను సైతం కలిసి టికెట్ కోసం ప్రయత్నించారు. అయితే కాంగ్రెస్ నుంచి ఆయనకు సరైన పిలుపు లభించలేదని తెలుస్తోంది. ఇదే సమయంలో అనూహ్యంగా బిజెపిలో చేరారు. ప్రస్తుతం కర్నాటక రాష్ట్రంలో బిజెపి తరపున ఎంపీ టికెట్ కోసం ఆయన ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. రాయదుర్గంలో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొనడం లేదు. కాపు కూటమి తరపున తనకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే అది తనకు నష్టం కలిగిస్తుందని కాలవ శ్రీనివాసులు భావిస్తున్నారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాపు రామచంద్రారెడ్డి కూడా రాయదుర్గంలో స్థానిక రాజకీయాల పట్ల ఆసక్తి కనబరచడం లేదు. అందుకే ఇంతవరకు ఆయన కాలవ శ్రీనివాసులును కలిసే ప్రయత్నం చేయలేదనే చర్చ జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాయదుర్గం రాజకీయాల్లో రాబోవు రోజుల్లో ఏ మార్పులు సంభవిస్తాయో అని ఓటర్లు భావిస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచించారు. సోమవారం తన నివాసంలో పట్టణంతో పాటు హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి చేస్తున్న ప్రచారంపై ఆరా తీశారు. అనంతరం ఎన్నికల ప్రచారాలపై మాట్లాడారు. అందరం కలిసికట్టుగా పనిచేసి గతంలో ఎప్పుడు లేని విధంగా హిందూపురంలో టిడిపిని గెలిపించేలా కృషి చేయాలన్నారు.

టిడిపిలో చేరిన ఎంఐఎం కౌన్సిలర్, నాయకులు

పట్టణంలోని 16వ వార్డు కౌన్సిలర్ మామాజుగ్ను, నాయకులు ఆదిల్, పట్టణ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ తదితరులు టిడిపిలో చేరారు. సోమవారం నాడు నందమూరి బాలకృష్ణ తన నివాసంలో వీరికి తెలుగుదేశం కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మైనార్టీలకు అన్యాయం జరిగిందన్నారు. మైనార్టీలకు టిడిపి హయాంలోనే న్యాయం జరిగిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే మైనార్టీలకు మేలు జరుగుతుందని భావించి ఆ పార్టీలో చేరామని ఎంఐఎం నాయకులు తెలిపారు.


ఎన్నికల ప్రచారాలపై టిడిపి నాయకులతో మాట్లాడుతున్న నందమూరి బాలకృష్ణ


జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్‌ను సన్మానిస్తున్న టిడిపి ఎంపీ అభ్యర్థి 'అంబికా' లక్ష్మీనారాయణ

టిసి.వరుణ్‌ను కలిసిన

అనంత టిడిపి ఎంపీ అభ్యర్థి 'అంబికా'

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రామ్‌నగర్ జనసేన పార్టీ కార్యాలయంలో టిడిపి అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబిక లక్ష్మీనారాయణ సోమవారం జనసేన అధ్యక్షులు టిసి వరుణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన విజయానికి సహకరించాలని అంబికా కోరారు. ఇందుకు టిసి వరుణ్ స్పందిస్తూ జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థుల విజయంలో జనసేన పాత్ర గణనీయంగా ఉంటుందన్నారు. అనంతపురం పార్లమెంట్ వ్యాప్తంగా అని నియోజకవర్గాల్లో తమ సహకారం మీకు అందిస్తామన్నారు. అనంతరం ఒకరి నొకరు సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొదిలి బాబురావు, అంకే ఈశ్వరయ్య, కుమ్మర నాగేంద్ర, ఇండ్ల కిరణ్‌కుమార్, సిద్ధు, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, సదానందం, ఎసిఎఫ్ వ్యవస్థాపకులు నేత్ర శీనా, నగర ప్రధాన కార్యదర్శి ఇమామ్‌హుస్సేన్, కుమ్మర మురళి, సంపత్, బళ్లారి అశోక్, ఆకుల అశోక్, గొంది శ్రీనివాసులు, ఎంసీ.బాలన్న సీనియర్ అడ్వకేట్, నాగరాజు, వరుణ్, డాలర్ మధు, హిద్దు, హరి, బళ్లారి అనిల్, నౌషాద్, వంశీ, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం వైసిపితోనే సాధ్యం

ఎపి ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్

ప్రజాశక్తి-హిందూపురం

మైనార్టీల సంక్షేమం వైసిపితోనే సాధ్యం అనిఎపి ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్ తెలియజేశారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల వైసిపికి రాజీనామా చేసిన ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్బాల్ పార్టీ వీడాలంటే సంతోషంగా వెళొచ్చన్నారు. అలా కాకుండా మైనార్టీలకు వైసిపి ప్రాధాన్యత ఇవ్వలేదని చెప్పడం సరికాదన్నారు. నాడు మైనార్టీలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గుర్తించక పోతే ఇక్బాల్‌కు టికెట్ వచ్చేది కాదన్నారు. ఎన్నికల ఓడిపోయిన తర్వాత రెండు సార్లు ఎమ్మెల్సీ పదవి ఇచ్చేవారు కాదన్నారు. ప్రస్తుతం టికెట్ ఇవ్వలేదన్న ఆక్రోశంతో ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం తగదన్నారు. స్వార్థం కోసం టిడిపితో ఇక్బాల్ చేతులు కలిపారన్నారు. అనవసరంగా వైసీపీపై విమర్శలు చేస్తే తగిన బుద్ధి చెబుతామంటూ హెచ్చరించారు. ముస్లిం మైనార్టీలకు వ్యతిరేఖంగా సిఎఎ, ఎన్ఆర్‌సి లాంటి చట్టాలను తీసుకొచ్చిన బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపిలోకి వెళ్తున్న ఇక్బాల్ మైనార్టీల సంక్షేమం గురించి మాట్లాడం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఇక హిందూపురం టిడిపి ఎంపీ అభ్యర్థి బికె.పార్థసారధి వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ మహిళా అభ్యర్థులను కించపరిచే విధంగా ఇటీవల మాట్లాడారన్నారు. మహిళలను గుర్తించాలన్న ఉద్దేశంతో జగన్మోహన్‌రెడ్డి రెండు స్థానాల్లో మహిళా అభ్యర్థులను పోటీలో నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్ షాజియా, అయూబ్, మాజీ ముతువల్లీ కలీం, హుమాయూన్‌తో పాటు ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న నవీన్‌నిశ్చల్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

జెసి, ఆర్ఓ అభిషేక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జెసి, ఆర్ఓ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని జాయింట్ కలెక్టర్, ఆర్ఒ అభిషేక్ కుమార్ సెక్టోరల్ అధికారులను ఆదేశించారు. జెసి సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ రూట్ మ్యాప్, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పర్యవేక్షించాలన్నారు. 44 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అనంతరం జెసి అధికారులతో కలిసి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దండు రోడ్డు, ముద్దిరెడ్డిపల్లి, మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ అరవింద్ నగర్‌లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అందులో ర్యాంప్, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. జెసి వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు తహశీల్దార్లు శివప్రసాద్, బాలనరసింహులు, భాగ్యలత, ఆర్ఐ బి.అమరేంద్ర, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డిశేఖర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

'చంద్రబాబుకు సంపద సృష్టించడం తెలుసు'

హిందూపురం ఎంపీ అభ్యర్థి బికె.పార్థసారధి

ప్రజాశక్తి- సోమందేపల్లి

చంద్రబాబు నేతృత్వంలోని తెలుగు దేశంపార్టీకి సంపద సృష్టించడం తెలుసని హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బికె.పార్థసారధి పేర్కొన్నారు. పెరిగిన ఆదాయాన్ని ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయడానికి టిడిపి కట్టుబడి ఉందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15వేలు, రైతులకు ఏటా రూ. 20వేలు, ప్రతి ఇంటికీ ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు నెలకు రూ. 1,500, ఉచిత బస్సు ప్రయాణం, వృద్ధులు, వితంతువులకు జూన్ నుంచి ప్రతి నెల 1వ తేదీనే ఇంటి వద్దనే రూ. 4 వేల పింఛను ఇస్తామన్నారు. పింఛన్ల విషయంలో వైసిపి శవ రాజకీయాలు చేసిందన్నారు. రాజధాని అమరావతి కోసం 29వేల మంది రైతులు 35 వేల ఎకరాల భూమి ఇచ్చారని తెలిపారు. అమరావతి అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా జరిగి ఉంటే రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం ఉండేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ అమరావతిని నాశనం చేశాడన్నారు. టిడిపి ఉద్యోగాలు, కళాశాలల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసిందన్నారు. టిడిపి తీసుకున్న నిర్ణయంతోనే ఆర్టీసీలో మహిళా కండక్టర్లకు అవకాశం కల్పించారన్నారు. ట్రాక్టర్ ఇసుక ధర ప్రస్తుతం రూ. 5వేలు ఉందని టిడిపి అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తామన్నారు. ఈ ఐదేళ్లలో వైసిపి అరాచకాలు శృతి మించాయని, ఎన్నికల్లో ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని బికె పార్థసారధి కోరారు.

జెడ్పీటీసీ శ్రీరాములు మృతికి పలువురి నివాళి



శ్రీరాములు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న పార్థసారధి

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ మండల జడ్పిటిసి సభ్యులు గుట్టూరు శ్రీరాములు సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే వివిధ పార్టీల రాజకీయ నాయకులు, ప్రముఖులు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందూపురం ఎంపి, పెనుకొండ ఎమ్మెల్యే టిడిపి అభ్యర్థులు బికె.పార్థసారథి, సవితమ్మ వేర్వేరుగా గుట్టూరు గ్రామం వెళ్లి శ్రీరాములు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బికె వెంట టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ సుబ్బారాయుడు, గుట్టూరు బోయ నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వున్నారు. సవితమ్మతో పాటు భర్త వెంకటేశ్వరరావు, నాయకులు కేశవయ్య, మాధవనాయుడు, చంద్ర, శ్రీనివాసులు ఉన్నారు.

శ్రీరాములు మృతికి వైసిపి ప్రముఖుల నివాళి

ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, హిందూపురం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భర్త వేణురెడ్డి, తదితరులు వేర్వేరుగా గుట్టూరు గ్రామం వెళ్లి శ్రీరాములు నివాసం వద్ద భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పల్లె సింధూరకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

పుట్టపర్తి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డికి మద్దతుగా తెలుగుతమ్ముళ్లు సోమవారం మండలంలోని తుమ్మలకుంట్లపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేసి సైకిల్ గుర్తుకు ఓటు వేసి పల్లె సింధూరరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు అభ్యర్థించారు. నాయకులు మాట్లాడుతూ టిడిపి హయాంలో మైనార్టీలకు రంజాన్ తోఫా, దుల్హన్ ఇచ్చేవారని, జగన్ ప్రభుత్వం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసిందే తప్పా వారి అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో వైసిపికి గట్టిగా బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో తుమ్మల మహబూబ్‌బాషా, ఆరీఫ్‌ఖాన్, మైనార్టీ మండల కన్వీనర్ షాను, పొగాకు జాకీర్ అహ్మద్, టైలర్ నిజాం, షబ్బీర్‌బాషా, చాంద్‌బాషా, డీలర్ బాబు, వాటర్ మెన్ బాషా, అబ్బులు, హారున్, ముసల్‌రెడ్డి, ఇర్ఫాన్, సికిందర్, సులేమాన్, షాహిద్, ఇమాంసాబ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన



సచివాలయంలో ఖాళీ బిందెలతో కూర్చున్న మహిళలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజలు ఖాళీ బిందెలతో సచివాలయంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఉగాది పండుగ రోజున స్నానం చేసేందుకు కూడా నీరు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామ వార్డు మెంబర్ గ్రామ పంచాయతీ బోరు నుంచి వచ్చే నీరు తన సొంత పొలానికి వాడుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గ్రామస్తులు నిలదీయగా 'నా ఇష్టం మీకు ఇష్టం వచ్చిన చోట చెప్పుకోండి' అన్నారని కార్యదర్శి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి నీటి అక్రమ వినియోగాన్ని అరికట్టి గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో ట్యాంకులతో నీటి సరఫరా

గాండ్లపెంట : మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీలోని కోటూరు గ్రామంలో తాగునీటి సమస్యను గ్రామస్తులు టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన ఆయన ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం నీటి ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో 200 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు.



నగదుతో సిఐ సుబ్రహ్మణ్యం, కృష్ణారావు

రూ. 1.78 లక్షల నగదు సీజ్

ధర్మవరం టౌన్ : ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 1,78,020 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కృష్ణారావు తెలిపారు. పట్టణంలోని ఎర్రగుంట్ల సర్కిల్‌లో సోమవారం సిఐ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పుట్లూరు మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన అశోక్ నాయుడు వాహనంలో రూ. 1,78,020 నగదు తీసుకెళుతుండగా పట్టుకున్నారు. నగదుకు సంబంధించి సదరు వ్యక్తం ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు.

వికలాంగులు, వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు

ఇఆర్ఒ వెంకటశివరామిరెడ్డి

ధర్మవరం టౌన్ : పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయలేని పరిస్థితిలో ఉన్న వికలాంగులు, 85 ఏళ్లు దాటిన వారు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపడగామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని సెక్టార్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, బీఎల్వోలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్ల వద్దకు రాలేని వారిని గుర్తించి ఫారం-12 నమోదు చేయాలన్నారు. దాని ప్రకారం ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని వికలాంగ, వృద్ధ ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, తహశీల్దార్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎంపిపి బిజెపిలో చేరిక

ముదిగుబ్బ : మండలంలోని బి.కొట్టాల గ్రామంలో సోమవారం వైసిసి ఎంపిపి ఆదినారాయణ యాదవ్ ధర్మవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో బిజెపిలో చేరారు. ఆయనకు సత్యకుమార్ బిజెపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ప్రభాకర్‌నాయుడు, సోమల ప్రకాష్ నాయుడు, వెంగమేష్‌నాయుడు, కొట్టాల శ్రీరాములు, కృష్ణమూర్తి యాదవ్, బిజెపి, టిడిపి, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ధర్మవరం టౌన్ : రంజాన్ సందర్భంగా హజరత్ టిప్పుసుల్తాన్ ఖిద్మత్ బందం సభ్యులు సోమవారం పట్టణంలోని పిఆర్ సర్కిల్‌లో ఉన్న ఫంక్షన్‌హాలులో 120 మంది పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఖిద్మత్ బందం సభ్యులు తెలిపారు.

నమాజ్ జంఖానాలు వితరణ

ముదిగుబ్బ : స్థానిక గేట్ కొట్టాలలోని మక్కా మసీదుకు సోమవారం రాష్ట్ర ముస్లిం నూర్‌బాషా దూదేకుల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కోడే కంటి హైదర్ వలి రూ. 35వేల విలువ చేసే 120 అడుగుల నమాజ్ జంఖానాలు అందజేశారు. కార్యక్రమంలో ముతవల్లి నూర్ మహమ్మద్, కె.అజారుద్దీన్, కె.సుజారుద్దీన్ పాల్గొన్నారు.

కందికుంట ఎన్నికల ప్రచారం

తలుపుల : కదిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సోమవారం మండలంలోని నూతన కాలవ పంచాయతీలోని తోగోటవారిపల్లి, ఎస్సీకాలనీ, నూతనకాలవలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. కందికుంటకు ప్రజలకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఆడపడుచులు హారతులు ఇవ్వగా యువత గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం కందికుంట ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కందికుంటకు హారతి ఇస్తున్న మహిళలు

'కార్పొరేట్'కు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ



విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

కార్పొరేట్ విద్యాసంస్థలు ముద్రించిన రంగు రంగుల కరపత్రాలు.. ఫలితాలను చూసి మోసపో కండి.. ఒక్కసారి ఆలోచన చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి విద్యార్థులకు సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎపిఆర్‌జెసి, నవోదయ, పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్లలో విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. బాబావలి మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పాటించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. విద్యార్థులను కళాశాలలో చేర్చుకుని తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులను మానసికంగా, నైతికంగా వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. వేధింపులతో ఇప్పటికే చాలామంది విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కార్పొరేట్ విద్యాసంస్థలు వద్దు.. ప్రభుత్వ విద్య ముద్దు... తల్లిదండ్రులు విద్యార్థులు భవిష్యత్తుపై ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, చంద్రశేఖర్, మోమిన్, సుహేల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు సహకరించాలని ఆర్‌డిఒ భాగ్య రేఖ సూచించారు. పట్టణంలో సోమవారం సెక్టార్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికలకు ఎలా సమాయత్తం కావాలి, కండక్ట్ ఆఫ్ ఎలక్షన్స్, ప్రిపరేషన్ ఆఫ్ క్లెయిమ్స్, పోస్టల్ బ్యాలెట్, 85 ఏళ్ళ పైబడిన వృద్ధులు, వికలాంగుల కోసం ఏవిధమైన ఏర్పాట్లు చేయాలి, తదితర అంశాలపై చర్చించారు. ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్లు వేణుగోపాల్, కళావతి, ఎఒ వెంకటస్వామి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, ఎలక్షన్ డిటి నరసింహులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు. అనంతరం సూపర్వైజర్లతో ఎన్నికల క్లైమ్స్, పిడబ్ల్యుడి, 85 ఏళ్ల పైబడిన ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల నిర్వహణకు వచ్చిన అధికారులకు పోస్టల్ బ్యాలెట్ సమకూర్చడం, తదితర అంశాల పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి మంచిపేరు తీసుకురావాలని ఆదేశించారు.

ఉమ్రా యాత్రను రాజకీయం చేయొద్దు : మక్బూల్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మక్బూల్, అత్తార్ చాంద్‌బాషా

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ముస్లిముల పవిత్ర ఉమ్రా యాత్రను రాజకీయం చేయొద్దని కదిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్. మక్బూల్ హితవు పలికారు. మున్సిపాలిటీలోని 22 వార్డులో కౌన్సిలర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. మక్బూల్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసం ఉంటూ అసత్య ఆరోపణలు చేస్తున్న వారిని అల్లాహ్ కూడా క్షమించడన్నారు. ఇఫ్తార్ విందుకు హాజరైన మైనారిటీల పక్షపాతి సిఎం జగన్ గురించి మాట్లాడేవారు, ఇఫ్తార్‌కి, ఇఫ్తార్ విందుకి తేడా తెలియని ముస్లింలు నా నియోజకవర్గంలో ఉన్నందుకు బాధపడుతున్నా అన్నారు. ఎవరెన్ని మాట్లాడినా ముస్లింలతో పాటు నియోజకవర్గ అభివృద్ధి వైసిపితోనే సాధ్యమన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా, రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు జిలాన్‌బాషా, నాయకులు సాధిక్‌బాషా, లింగాల లోకేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఉపాధ్యాయులకు అండగా ఉంటా

పేద, ధనిక తారతమ్యాలు లేకుండా వారి జీవితకాలంలో ఎందరో విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చే గురువులకు సమాజంలో ప్రత్యేకమైన స్థానం ఉందని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్.మక్బూల్ పేర్కొన్నారు. పట్టణంలోని బటర్‌ఫ్లై పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రయివేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వృత్తిరీత్యా ఎంతోమంది కుటుంబ సభ్యులతో అనుబంధం కలిగిన మీరు ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం మీ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణంలోని వివిధ ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయ, ఉపాధ్యాయినీలు, అధ్యాపకులు హాజరయ్యారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తనయుడి ప్రచారం



శ్రీధర్‌రెడ్డి తరపున ప్రచారం చేస్తున్న కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోమారు గెలిపించి అభివృద్ధికి బాటలు వేద్దామని ఆయన తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి సోమవారం మండలంలోని మిట్టపల్లి పంచాయతీలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ చేపట్టిన నవరత్నాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో కుల మతాలు, పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పనిచేశారని గుర్తుచేశారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజునాయుడు, సర్పంచులు సాజిదా, జగన్మోహన్‌చౌదరి, మజీదు, లక్ష్మిరెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాసులు, హరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించండి

ఎఐసిసి పరిశీలకులు శంకర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 12 గ్యారెంటీ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల ని ఎఐసిసి ఎన్నికల పరిశీలకులు శంకర్ సూచించారు. ఆయన సోమవారం పట్టణంలో నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డితో పార్టీ పరిస్థితులపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఆదరణ ఉందన్నారు. అధిష్టానం ప్రకటించిన 12 గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి రైతుకూ రూ. 2 లక్షల రుణమాఫీ, ప్రతి పేద మహిళకు నెలకు రూ. 8,333 ప్రకారం ఏడాదికి రూ. లక్ష, రైతుకు పంట పెట్టుబడిలో 50 శాతం కనీస మద్దతు ధర, రూ. 5 లక్షలతో ఇందిరమ్మ గృహ నిర్మాణం, పదేళ్ల పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఏడాది పొడవునా ఉపాధి పనులు, రోజు కూలి రూ. 400, తదితర పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పుట్టపర్తి, బుక్కపట్నం, నల్లమడ మండలాల పార్టీ కన్వీనర్లు పుట్ల గంగాద్రి, గౌస్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థికి సన్మానం



సునీల్ కుమార్‌ను కలిసిన అగళి మండలం యువత

ప్రజాశక్తి-మడకశిర

అగళి మండలంలోని దొక్కలపల్లికి చెందిన యువకులు సోమవారం బెంగళూరు నుంచి వచ్చి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్నను కలిశారు. వారు సునీల్‌కుమార్‌ను శాలువా, పూలమలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ సునీల్ గెలుపునకు తాము కృషి చేస్తామని తెలిపారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ దొక్కలపల్లి గ్రామ ప్రధాన సమస్యలు తన దృష్టికి వచ్చాయని టిడిపి అధికారంలోకి రాగానే పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతం నుంచి యువత ఉపాధి కోసం బెంగళూరుకు వలస పోతున్నారని, ఇక్కడి సెజ్ భూముల్లో పరిశ్రమలు స్థాపిస్తే తల్లిదండ్రులతో కలిసి నియోజకవర్గంలోనే వ్యవసాయంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంపొందుతాయన్నారు.

ఓట్ల కోసమే వైసిపి రంజాన్ తోఫా పంపిణీ : టిడిపి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మైనార్టీలను అధికార వైసిపి మోసం చేసిందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పెనుకొండ పట్టణంలో సోమవారం వారు మాట్లాడుతూ స్థానిక వైసిపి నాయకులకు గత నాలుగేళ్లలో ముస్లింలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. నేడు ఓట్ల కోసం దొంగ చాటుగా రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నారని మండిపడ్డారు. టిడిపి హయాంలో ఏటా మైనార్టీలకు రంజాన్ తోఫా అందించేవారని, వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముస్లింలకు రంజాన్ తోఫా ఇవ్వలేదన్నారు. ఎన్నికల వేళ ముస్లింల ఓట్ల కోసం వైసిపి నాయకులు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం శోచనీయమన్నారు. పెనుకొండ పట్టణంలో బహిరంగంగా ప్రతి ఏడాది మైనార్టీలకు రంజాన్ తోఫా ఇచ్చిన ఘనత నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జప్రుల్లాఖాన్, షౌకత్, దాదు, శమూన్, నజీర్, అస్లాం, రబ్బానీ, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-పుట్టపర్తి

కొత్తచెరువు పట్టణంలోని నాలుగు సచివాలయాల పరిధిలోని 34 మంది, కోడపగానిపల్లిలో 19 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం వారు రాజీనామా లేఖలను ఎంపిడిఒ సిద్ధారెడ్డికి అందజేశారు. వారు మాట్లాడుతూ వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడం వల్ల రాజీనామా చేసి సెల్‌ఫోన్, ఇతర వస్తువులను వారికి అందజేశామన్నారు. కార్యక్రమంలో చాంద్ బాషా, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : మండలంలో 12 సచివాలయాల్లో పని చేస్తున్న 286 మందికి గానూ ఇప్పటి వరకూ 131 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. వారు సోమవారం రాజీనామా లేఖలను ఎంపిడిఒ వరలక్ష్మి, ఎఒ రెడ్డప్పకు అందజేశారు.

ప్రజలకు ఎస్పీ ఉగాది శుభాకాంక్షలు

పుట్టపర్తి రూరల్ : జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బందికి ఎస్పీ మాధవ్‌రెడ్డి శ్రీక్రోధి నామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ఉగాది అంటే అందరికీ గుర్తు వచ్చేది తెలుగు పండుగ, ఈ ఉగాది పండుగతో అందరి జీవితాల్లో వెలుగులు రావాలని ఆకాంక్షించారు. తెలుగు ప్రజల మొదటి పండుగ ఉగాది వేడుకలను కుటుంబ సభ్యులందరూ కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. పండుగ వేళ యువకులు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు.

నేడు ఉగాది కవిసమ్మేళనం

హిందూపురం : శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు స్థానిక ఆర్‌పిజిటి రోడ్డులోని అల్ హి లాల్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జెవివి కార్యదర్శి డాక్టర్ ఈటి రామ్మూర్తి తెలిపారు. కవిసమ్మేళనంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం పట్టివేత

నల్లచెరువు : కదిరి-మదనపల్లె రహదారిలో హెచ్‌పి పెట్రోల్ బంకు వద్ద సోమవారం మద్యం అక్రమంగా రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కెఎం.లింగన్న తెలిపారు. అందిన సమాచారం మేరకు హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద వాహనాలను ఆపి తనిఖీ చేస్తుండగా తనకల్లు వైపు నుంచి వస్తున్న నలుపు రంగు స్కార్పియోలో తరలిస్తున్న 80 హైవార్డ్స్ విస్కీ 90 ఎం.ఎల్, ఓల్డ్ అడ్మిరల్ 3 ఫుల్ బాటిళ్లను సీజ్ చేశామన్నారు. ఎన్‌పి కుంట మండలంలోని ఎదురుదోన గ్రామానికి చెందిన స్కార్పియో డ్రైవర్ ఈశ్వరయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కారును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బత్రేపల్లిలో చలివేంద్రం

తలుపుల : మండలంలోని బత్రేపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వెంకట నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముఖ్యఅతిథి సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ ప్రారంభించారు.

వైసిపి తరపున డికె బాబు ప్రచారం

తలుపుల : ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి కదిరి ఎమ్మెల్యేగా మక్బూల్ అహ్మద్‌ను, హిందూపురం ఎంపిగా శాంతమ్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైసిపి సేవాదళ్ జోనల్ ఇన్‌ఛార్జి డికె.బాబు ప్రజలను కోరారు. ఆయన సోమవారం తలుపుల పంచాయతీలోని ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ, మెయిన్ బజార్‌లో వైసిపి తరపున ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఫయాజ్, ఎంపిటిసిలు, జడ్పిటిసి, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ

బత్తలపల్లి : త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్లను సోమవారం మండలంలోని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి నాయకుల ఆధ్వర్యంలో ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్య ప్రకాష్‌బాబు నివాసంలో జడ్పిటిసి కోటి సుధ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సభ్యులు ఆర్వేటి రామ కృష్ణ, గంటాపురం శ్రీరాములు, ఆశోక్, ఆనంద్, రామ్మోహన్, వంశీ, దామోదర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ఓబుళదేవరచెరువు : మండలంలోని డబురువారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నాగరాజు సోమవారం తన జన్మదినం సందర్భంగా పాఠశాలలోని 20 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడి సేవా దృక్పథాన్ని ఎంఇఒ రమణ, హెచ్‌ఎం చంద్రమౌళి, రాజు మెచ్చుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం

ధర్మవరం టౌన్ : పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ సత్యనారాయణ, డీఈ వన్నూరుస్వామి, ఎఇ హరీశ్ పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వైసిపి అరాచక, దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరై పల్లె రఘునాథ్‌రెడ్డి, జిఎం శేఖర్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తేనే జగనాసుర అనే రాక్షసుడు బారిన పడిన ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. ఈ రాక్షసుడిని అంతమొందించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన చారిత్రాత్మక అవసరం ఉందన్నారు. మూడు పార్టీల నాయకులు సమిష్టిగా పని చేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరరెడ్డిని, ఎంపిగా బికె.పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, బెస్త చలపతి, మహమ్మద్ రఫీ, గూడూరు ఓబులేషు, సామకోటి ఆదినారాయణ, సాలక్కగారి శ్రీనివా సులు, గంగాధర్‌నాయుడు, శ్రీరామిరెడ్డి, కూటమి నాయకులు సుదర్శన్, దివ్య తేజ, లాయర్ హరికృష్ణ, హనుమంతరెడ్డి, కొండమరాజు, జ్యోతి ప్రసాద్, సునీల్ వైట్ల, బాలగంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



పల్లె సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి కుటుంబాలు

టిడిపితోనే మైనార్టీల అభివృద్ధి

పుట్టపర్తి : టిడిపితోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమవుతుందని పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. బుక్కపట్నంలో సోమవారం పల్లె ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పల్లె మాట్లాడుతూ టిడిపి హయాంలో మైనార్టీలు అన్ని విధాలా అభివృద్ధి సాధించగా వైసిపి పాలనలో అన్ని రకాలుగా వెనుకబడ్డారని తెలిపారు. పల్లె ముస్లింలతో కలిసి మసీదులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.

30 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరిక

కొత్తచెరువు పట్టణంలోని బిసి కాలనీకి చెందిన 30 వైసిపి కుటుంబాలు సోమవారం టిడిపిలో చేరాయి. వారికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిం చారు. చేరిన వారు మాట్లాడుతూ బిసి కాలనీలో తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, తదితర కనీస సౌకర్యాలు కల్పించడంలో వైసిపి ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్నారు. పల్లె మాట్లాడుతూ పల్లె సింధూర రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివా సులు, నాయకులు డిపో భాస్కర్, నాగేంద్ర, రమేష్, కిరణ్, వెంకటేష్, రామ్మో హన్, పెద్దన్న, ఎస్. వంశీకిషోర్, నల్లమాడ శంకర్, చికెన్ సెంటర్ వెంకటేష్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.